



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

సోమవారం 8 సెప్టెంబర్ 2025 పేజీలు 8





## బెంజిసర్కిల్‌లో ఎగ్జిబిషన్‌కు

# అనుమతులెక్కడ?

- గడువు ముగిసినా అనధికారికంగా ఎగ్జిబిషన్ నిర్వహణ
- చేతులెత్తేసిన అన్ని శాఖలు
- వీఎంసీకి డబ్బులు చెల్లించకున్నా సిఎంవోహెచ్ సపోర్ట్
- రోజుకు నాలుగువేలకు గాను రెండు వేలే వసూలు..
- ట్రేడ్ లైసెన్స్ తీసుకోని వైనం
- ఎనిమిది రోజులుగా అనధికారికంగా నిర్వహిస్తున్న సపోర్ట్ చేస్తున్న అన్ని శాఖలు
- నిత్యం ట్రాఫిక్‌తో వాహన చోదకుల అష్టకష్టాలు

(విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్)

ఎగ్జిబిషన్‌కు అనుమతుల వ్యవహారంలో అధికారులు సామాన్యుల కైతే చుక్కలు చూపిస్తారు. కాని టిడిపి నేతలకు మాత్రం ఎమ్మెల్యే కాని ఎంపి కాని చెబితే చాలు ఆఘమేఘాల మీద ఎటువంటి అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా దోచుకోవడానికి అనధికారికంగా అనుమతులిచ్చేస్తారు. ఎగ్జిబిషన్ పూర్తయ్యే దాకా వాటి వైపు కన్నెత్తి కూడా చూడరంటే వారికి 2

> బెంజిసర్కిల్‌లో ఎగ్జిబిషన్ గడువు పూర్తైన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఒక ఎగ్జిబిషన్ నిర్వహించాలంటే ఎన్నో షరుతులు కండీషన్లు... కాని ఫైరింజన్ కూడా దూరని ప్రదేశంలో ఎగ్జిబిషన్ పెట్టి దాదాపు దాని గడువు ఆగస్టు 31తోనే పూర్తైనా అధికారులు ఇటువైపే చూడడం మానేశారు. ప్రస్తుతం గత ఎనిమిది రోజులుగా ఎటువంటి అనుమతులు రెన్యూవల్ లేకున్నా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

# పెద్దాయనా బాగున్నారా..

## పాడి పంటలు ఎలా ఉన్నాయి?

- సమృద్ధిగా ఎరువులున్నాయి.. ఆందోళన అనవసరం
- గ్రామాల్లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సుడిగాలి పర్యటన
- సిటిజన్ అవుట్‌రీచ్ ద్వారా అన్నదాతలకు భరోసా కల్పించిన కలెక్టర్


2లో



## క్యాలిక్లేటర్లో....

# లంచం లెక్కలు..!

- కుదిపేస్తున్న అవినీతి పెత్తనం
- ఈ వసూళ్ళ దందాకు అంతే లేదా..?
- ఇలా అయితే తొందరలోనే ఊసలు లెక్కబెట్టే రోజు వస్తుంది అంటూ కొందరు పెదవి విరుపు



**తిరువూరు మేజర్ న్యూస్ :** లంచం తీసుకునే చేయి దేశాన్ని దోచే కత్తి అన్నట్లు తిరువూరులో కొందరి అధికారుల తీరుకు నిదర్శనం గా ఉందంటున్నారు సామాజిక విశ్లేషకులు......పెరిగిన అవినీతి పెత్తనం ప్రజలను కృంగదీస్తుంది, మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## క్యాలిక్లేటర్లో లంచం లెక్కలు..!

వసూళ్ల దందాకు అడ్డుకట్ట లేదా...? అవినీతి చేతిలో ఉంటే ఊరంతా కాళి... అవినీతితో సమాజం అగాథంలోకి నెట్టివేయబడుతుంది.... ప్రభుత్వాలు తగిన నిర్ణయాలు తీసుకొని అవినీతిని కట్టడి చేయాల్సిందే... తిరువూరు మండల పరిధిలో ఓ కార్యాలయములో మోనర్కు గురించి పాఠకులకు విధితమే అలాంటిదే మరో కార్యాలయంలో ఓ అధికారి డబ్బులు కోసం వేధించడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇప్పటి ప్రభుత్వంలో ఏసీబీ దూకుడు పెంచి అవినీతి అధికారుల భరతం పడుతున్న సంగతి మనం చూస్తూనే ఉన్నాం. అయినా ఏమీ పట్టనట్లుగా డబ్బే పరమవధిగా ఉన్నన్న రోజులే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలన్న అనాలోచిత అజ్ఞానంతో కొంతమంది అధికారుల ఆత్రుత ఆరాటం అంతులేకుండా పోతుందని మేధావి వర్గం మాట్లాడుతుంది, తిరువూరు నియోజకవర్గంలోనీ ఏ.కొండూరు మండలంలో ఓ మండల వ్యవసాయ అధికారి కాసులకు కక్కుర్తిపడి, ఉన్నప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని దురుద్దేశంతో రైతులను మోసం చేయడంలో ఏమాత్రం వెనకాడకుండా దేశానికి అన్నం పెట్టే రైతులను మోసం చేసి యూరియా బస్తాలను ప్రైవేటు వ్యక్తులకు పంపడంపై ఆయనపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఇది ఇలా ఉండగా ఓ అధికారి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన అవినీతి ఆరోపణలపై అతను కూడా సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఇటు ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు తప్పు చేసిన వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కఠినమైన నిర్ణయాలు తీసుకొంటుండగా ప్రజలకు జవాబుదారీగా ఉండవలసిన అధికారులే లంచగొండి అవతారం ఎత్తిన వారిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకుంటున్న జంకు బొంకు లేకుండా ప్రవర్తిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తుంది. ఇంత జరుగుతున్న కొంతమంది అధికారులు దున్నపోతు మీద వాన పడ్డ చందంగా వ్యవహరించడం చూస్తుంటే ఎవరైనా ముక్కున వెలేయల్సిందే అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మరో కార్యాలయంలో ఈమధ్య వచ్చిన ఓ అధికారి వసూలు పర్వానికి తెర లేపారని ప్రచారం విస్తృతంగా వ్యాపించిందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ప్రజలు ఏ పని మీద వెళ్లిన లేనిపోని కొర్రీలు పెట్టి డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ పనులను బట్టి రేటు ఎంత అని సులువైన సూత్రం తెలుసుకొని ఎవరికి చిక్కకుండా అందరిదీ చేతివాటమైతే వారిది క్యాలిక్యులేటర్ వాటమని లంచం ఎంత ఇవ్వాలో కాలిక్లేటర్ లో అంకెలు చూపిస్తూ గుట్టు చప్పుడు కాకుండా జాగ్రత్త పడుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ఆమ్యామ్యాలు నాకు మాత్రమే కాదు నా పై అధికారులకు కూడా ఇవ్వాలి పర్సంటేజ్ ప్రకారం ఎక్కువ మొత్తంలో చెల్లించాలి ఎన్నో డబ్బులు పెట్టి ఇక్కడికి వచ్చాను నేను మాత్రం వసూలు చేయకపోతే ఎట్లా నేను పెట్టిన డబ్బులు రాబట్టు కోవాలి కదా...! అంటూ బహిరంగంగానే వారు మాట్లాడటం విశేషం. అందిన కాడికి పోగేసుకోవాలంటూ మాట్లాడుతున్న మాటలు ఎంత బరితెగింపుగా ఉన్నాయో అర్థమవుతుంది. ఆ సీట్లోకి ఎవరొచ్చినా అంతేనా...? ఏ పనైనా అధికారి వద్దకు వెళితే అయినవారికి బంగారు పళ్లెంలో కాని వారికి కంచంలో అన్న చందంగా వ్యవహరిస్తూ వారు పనులు చేయకుండా ప్రదక్షిణలు చేపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి పనినీ బట్టి రేటు పలుకుతుందని ఎంతటి వారైనా ముడుపులు చెల్లించాల్సిందేనని లేని పక్షములో ఆ పనికి రోజులు తరబడి తిరగాల్సిందని ప్రజలు వాపోతున్నారు. విసుగు చెందుతున్న ప్రజలు ఇలాంటి అవినీతి అధికారులపై ఏసీబీ దాడులు జరిగితే తప్ప అవినీతిని అరికట్టలేమని నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. ఇప్పటికైనా లంచగొండి అధికారులపై నిఘా పెట్టి చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన ఎస్ఐ వి.ఆర్.కు అటాచ్

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** వినాయక నిమర్జన ఊరేగింపుల నేపథ్యంలో అర్ధరాత్రి 01.30 గంటల సమయంలో డి.జే.ను ఆపమనే క్రమంలో సంయమనం కోల్పోయి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడి క్రమశిక్షణా రాహిత్యంగా ప్రవర్తించినందుకు అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. ఎం.దుర్గా మహేశ్వర రావును నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వి.ఆర్. కు అటాచ్ చేశారు.




# బెంజిసర్కిల్‌లో ఎగ్జిబిషన్‌కు అనుమతులెక్కడ?

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి నేతలంటే ఎంత స్వామి భక్తో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా బెంజి సర్కిల్ వద్ద ఎగ్జిబిషన్‌కు ఆగస్టు 31వ తేదీ నాటికే గడువు పూర్తైంది. కాని గత ఎనిమిది రోజులుగా అనధికారికంగా నిర్వహిస్తున్న అధికారులు ఈ ఎగ్జిబి షన్ వైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలక తావిస్తోంది. శని, ఆది వారాల్లో వందల సంఖ్యలో ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వీక్షకులు వస్తుంటారు. కాని వీరికి సరైన సదుపాయాలు కూడా చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో పాటు వెహికల్ పార్కింగ్ చేసుకోవాలన్న అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి. మరోవైపు ఎగ్జిబిషన్ లోపల ఏగేమ్ టచ్ చేసినా జేబులకు చిల్లులే అంటూ ఎగ్జిబిషన్‌కు వచ్చిన వీక్షకులు గగ్గోలు పెడుతున్నారు.

**ఎగ్జిబిషన్ నిర్వాహకులపై సిఎంఓహెచ్ ఉదాశీనత ?**

ఎగ్జిబిషన్ నిర్వహణకు సంబంధించి సిఎంవోహెచ్ పాత్ర కీలకంగా ఉంటుంది. ఎగ్జిబిషన్‌లో చెత్తా చెదారం అంతా ఉదయాన్నే శానిటేషన్ వాళ్ళే శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఇందుకు గాను ఎగ్జిబిషన్ నిర్వాహకులు విఎంసికి రోజుకు నాలుగు వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. కాని ఎంపి, ఎమ్మెల్యే సపో ర్ట్ తో కేవలం రెండు వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. మరోవైపు ట్రేడ్ లైసెన్స్ తోపాటు ఇతర అనుమతులకు సంబంధించి లేకపోగా వాటి రెన్యూవల్ కూడా ప్రస్తుతం లేవన్న ప్రచారం జరుగుతుంది. అయితే పట్టించుకోవాల్సిన అధికారులు మామ్మూళ్ళ మత్తులో చూసిచూడనట్లుగా వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చూడాలి అధికారులు ఇప్పటికైనా గడువు ముగిసిన ఎగ్జిబిషన్‌పై చర్యలు తీసుకుంటారా లేక ఎప్పటిలాగే చూసీ చూడనట్లు వదిలేస్తారా అనేది...

# పెద్దాయనా బాగున్నారా.. పాడి పంటలు ఎలా ఉన్నాయి?



### సమృద్ధిగా ఎరువులున్నాయి.. ఆందోళన అనవసరం

### గ్రామాల్లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సుడిగాలి పర్యటన

### సిటిజన్ అవుట్‌రీచ్ ద్వారా అన్నదాతలకు భరోసా కల్పించిన కలెక్టర్

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 07, మేజర్ న్యూస్:** రైతులకు ఇబ్బంది లేకుండా నిరంతర పర్యవేక్షణతో యూరియా, ఇతర ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతోందని.. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. సరైన అవగాహనతో ప్రభుత్వ సేవల సద్వినియోగంతో ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నదాతలకు భరోసా కల్పించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన అగ్రికల్చర్ అవుట్‌రీచ్ (జన జాగృతి) కార్యక్రమం జరిగింది. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఎరువులపై అవగాహన కల్పించారు. మీకు తోడుగా మేమంతా ఉన్నాం.. అంటూ ఎరువుల వివరాలను తెలియజేస్తూ భరోసా కల్పించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఉదయం నుంచే వివిధ గ్రామాల్లో పర్యటించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి, ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు, కంచికచర్ల మండలం చెవిటికల్లు, మైలవరం మండలం చంద్రగూడెం, నందిగామ మండలం ఐతవరం, పెనుగంచిప్రోలు మండలం కొనకంచి, జగ్గయ్యపేట మండలం బండిపాలెం.. ఇలా వివిధ గ్రామాల్లో పర్యటించి అన్నదాతలతో ముచ్చటిస్తూ యోగక్షేమాలను అడుగుతూ ఎరువుల పరంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆయా ప్రాంతాల్లో ఎరువుల సరఫరా తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, రైతు బాగుంటేనే గ్రామం, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని.. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి రైతు బాగోగులు, వ్యవసాయ రంగ అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, అక్కడ అందుబాటులో ఉన్న ఎరువులు, వచ్చే వారంలో వచ్చే ఎరువుల వివరాలు తదితరాలకు సంబంధించిన సమాచారాన్ని వివరించడంతో పాటు పంట దశ ప్రకారం వినియోగించాల్సిన ఎరువుల మోతాదు, నానో యూరియా ప్రయోజనాలను కూడా వివరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పటిష్ట ప్రణాళిక ప్రకారం సజావుగా యూరియా, ఇతర ఎరువుల సరఫరా జరుగుతోందని, అవసరానికి అనుగుణంగా ఎరువులు పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. రియల్ టైమ్ ఇన్ఫర్మేషన్‌తో ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రభుత్వం నిరంతరం పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.









# దసరా కానుకగా డీఏ మంజూరు చేయండి

**ఉద్యోగుల సమస్యల పరిష్కారం వైపు ప్రభుత్వం అడుగులు వేయాలి.**

**పీఆర్సీ కమిషనర్ నియామకం పెండింగ్ బిల్లులపై చర్యలు తీసుకోండి**

**ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షులు, ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్**



**తిరుపతి, సెప్టెంబర్ 07, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు నిర్మాణాత్మక సహకారం అందిస్తున్నారని.. గత ప్రభుత్వం ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసిందని, అయితే కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా డీఏ మంజూరు చేయాలని ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షులు, ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి పర్యటన నేపథ్యంలో ఆదివారం తిరుపతి ఎన్‌జీవో హోమ్‌లో విద్యాసాగర్ మీడియా సమావేశం నిర్వహించారు.మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ ఆర్నెల్లకోసారి ఇవ్వాల్సిన డీఏ మంజూరు కావడం లేదని.. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిల విషయంలోగానీ అపరిష్కృతంగా ఉన్న సమస్యలనుగానీ పరిష్కరించాలని వత్తిడి చేయలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదేమో అన్న ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. 25 నెలలు గడుస్తున్నా వేతన సవరణ కమిషన్ వేయకపోవడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు న్యాయం జరిగేలా తక్షణమే కొత్త కమిషనర్ నియామకం చేపట్టాలన్నారు. గత మూడునాలుగేళ్లుగా సంపాదించిన సెలవు మొత్తాలు, డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటికి త్వరితగతిన ఆర్థిక ఆమోదం తెలపాలని కోరారు. రూ. 30 వేల కోట్ల బకాయిల విషయంలోనూ చర్యలు తీసుకోవాలన్నారు. అందరి వైపూ వెళ్తున్న ప్రభుత్వ జగన్నాథ రథచక్రాలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లవైపు వెళ్లడం లేదనే భావన నెలకొందన్నారు.

అందువల్ల ప్రభుత్వ జగన్నాథ రథచక్రాలు ఉద్యోగుల పీఆర్సీ వైపు, డీఏ వైపు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వైపు, హామీల అమలువైపు వెళ్లాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఫోరంను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సమస్యలతో పాటు ఆర్థికేతర సమస్యలూ పెండింగ్‌లో ఉన్నాయని.. ఒక్క బకాయిలు, కేసులు, ఒకటో తేదీన జీతాలు విషయంలో తప్పితే మరే సమస్యపైనా దృష్టిపెట్టడం లేదనే బాధ ఉద్యోగుల్లో ఉందన్నారు. రూ. 30 వేల కోట్ల బకాయిలకు సంబంధించి ఒక రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి అందరికంటే మాకు బాగా తెలుసు.. వీటిని గమనిస్తూనే ముందుకెళ్లున్నాం.. ఎంతో అనుభవం ఉన్న ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యలపై దృష్టిపెట్టాలని కోరుతున్నం. పి.ఆర్.సి కమిషనర్ పునర్నియామకంలో ఆలస్యం, పి.ఆర్.సి నివేదిక తుదీకరణలో జాప్యం దృష్ట్యా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తాత్కాలిక ఉపశమన భత్యం మంజూరు చేయవల సిందిగా కోరుకుంటున్నామన్నారు. వీటితోపాటుగా రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ మొత్తాలు మొదలైనవి తక్షణమే విడుదల చేసి, వారికీ రిటైర్మెంట్ అనంతరం అవసరాలు తీర్చుకునేలా ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయంలో 2023లో ప్రభుత్వం జూన్ 2014 లోపునియమించబడిన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయం తీసుకుని దాదాపు 3000 మందిని రెగ్యులరైజ్ చేసింది. మిగిలిన వారిని రెగ్యులరైజ్ చేయవలసిందిగా కోరడం జరిగిందని తెలిపారు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అడుగులు వేయాలన్నారు ఏపీ ఎన్జీవో రాష్ట్ర సంఘం డిమాండ్ మేరకు ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిరహించడం జరిగిందన్నారు పెన్షనర్లకు సంబంధించి 70 నుండి 75 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పెన్షనర్లు/ఫ్యామిలీ పెన్షనర్లకు బేసిక్ పెన్షన్‌పై 10%, 75 నుండి 80 సంవత్సరాల మధ్య వయస్సు వారికి 15% అదనపు పెన్షన్ గతంలో ఇవ్వబడేదన్నారు. 11వ పి.ఆర్.సి అమలు తర్వాత రద్దు అయిన ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించవలసిందిగా కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంచారు. అదే విధంగా పబ్లిక్ సెక్టార్ యూనిట్స్, గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకూ ఈ సౌకర్యాన్ని కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. వీటితో పాటుగా ఇతర ప్రధాన సమస్యలైన 1-9-2004 లోపు పోస్టింగ్ పొందిన ఉద్యోగులకు ఓపిఎస్ అమలు, హెచ్ ఓ డీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంటి స్థలాలు, ఏపీ జి ఎల్ ఐ పాలసీలకు బోనస్ ప్రకటన, ఈహెచ్ఎస్ స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహణ, రీయంబర్స్మెంట్ రెండు లక్షల నుంచి 5 లక్షల పెంపు, బిల్లుల మంజూరులో ఆలస్యాన్ని సవరించటం, ఒప్పంద ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు, రెండు సంవత్సరాల ఉద్యోగ కాలం పూర్తి చేసిన గ్రామ వార్డు సచివాలయు ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు.

### చిత్తూరు జిల్లా అడహాక్ కమిటీ ఏర్పాటు

తిరుపతి జిల్లాలోని ఏపీ ఎన్జి జి వో సమావేశంలో తిరుపతి జిల్లా ఆడహాక్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది: ఛైర్మెన్ గా యస్ సురేష్ బాబు కోకన్వీనర్ గా సి రఘు కోశాధికారిగా వి లలిత కుమార్కమిటీ సభ్యులు గా చెంచు రత్నం పణింద్ర జనార్దనయ్య ఉపాధ్యక్షులుగా శవణ్ కుమార్ ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె. జగదీశ్వరరావు,,రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్,కడప జిల్లా అధ్యక్షులు బి శ్రీ నివాసులు, నెల్లూరు జిల్లా అధ్యక్షులు యం పెంచల్ రావు, జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, తిరుపతి తాలూకా అధ్యక్షులు యస్ సురేష్ బాబు, కార్యదర్శి బాలాజీ, జిల్లా నాయకులు అన్ని తాలూకా కార్వర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా వినాయక నిమజ్జనోత్సవం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలోని వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. పురటిపాడు బాల వినాయక కమిటీ వారు స్వామివారిని యువతి యువకులు నిర్వహించిన కర్ర సాము, కోలాట ప్రదర్శనలు, తీన్‌మార్ డప్పులు, బాణాసంచా, కనక డప్పుల వాయిద్యాలతో పురిటిపాడు, కట్టవాని చెరువు, చింతలగుంట, జేమ్స్ పేట, కూరాడ, గుడ్లవల్లేరు ప్రధాన వీధుల్లో ఊరేగించారు. స్వామివారితో పాటు మహిళా భక్తులు, చిన్నారులు సైతం భారీ సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. స్వామివారికి అడుగడుగునా మహిళా భక్తులు హారతులు



సమర్పించి బ్రహ్మరథం పట్టారు.



## ఇసుక వాహనాలు ఏపి సరిహద్దు దాటుతున్న కొరవడుతున్న నిఘా..





**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 7, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రజలకు ఉచిత ఇసుక పథకం ప్రజలకు అందుతుంది. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రాంతంలో కొందరికి మాత్రం ఇసుక అక్రమ రవాణాతో కాసుల వర్షం కురిస్తుందని ప్రజల నుండి బహిరంగ చర్చలు వినిస్తున్నాయి. ఎందుకంటే జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రాంతంలో కృష్ణా, మున్నేరు,పాలేరు నదుల వెంబడి మూడు మండలాలలో సహజ సిద్ధంగా రేవులలో ఇసుక లభ్యమౌతుంది.జగ్గయ్యపేట మండలానికి సరిహద్దుగా తెలంగాణ రాష్ట్రంలో చింతలపాలెం,హుజుర్ నగర్,కోదాడ, దొండపాడు, మేళచెరువు,నేలకొండపల్లి మండలాలు, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకి తెలంగాణ సరిహద్దుగా బోనకల్లు,మదిర తదితర మండలాలు నియోజకవర్గ ప్రాంతానికి శివారు గా ఉన్నాయి.తెలంగాణాకి చేరుకోవాలంటే జగ్గయ్యపేట నియోజకవర్గ సరుహద్దుగా సుమారు 15 నుండి 20 లోపు వివిధ రకాలుగా రహదారులున్నాయి. తెలంగాణకి ఇసుక అక్రమంగా తరలించే వాహనాల పై జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రాంతంలో కొన్ని సందర్భాలల్లో పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.కాని పోలీసుల కళ్లు కప్పి ఇసుక అక్రమార్కులు జగ్గయ్యపేట ప్రాంతం నుండి తెలంగాణాకి దొడ్డిదారిన ఇసుకని అక్రమంగా తరలించడానికి తెరలేపుతున్నారు.ఈ అక్రమ దందా వెనుక నందిగామ డివిజన్ ప్రాంతంలో ప్రధానంగా సుమారు పది మంది పైబడి పేర్లు బహిరంగంగా ప్రజల నాలుకలో నానుతూ వినిపిస్తున్నట్లు సమాచారం.తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో గల మండలాలలో ఇప్పటికే వీరిలో కొంతమందిపై ఇసుక అక్రమ తరలింపు పై విపరీతమైన కేసులు నమోదు అవుతున్నట్లు తెలంగాణ ప్రజల నుండి సమాచారం తెలుస్తుంది.దీనికి ఉదాహరణగా ది.03 /09/25 న హుజుర్ నగర్ పోలీస్ లకు పట్టుబడిన వాహనం,దానిని రెండు రోజుల పాటు జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రాంతంలో గల ఇసుక అక్రమార్కులు ఎవ్వరెవ్వరని గుర్తించి వారిని విచారించగా,వీరిలో దొడ్డిదారిన అక్రమార్జన కోసం కొన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ముద్రణలు,స్టాంపులు వెలుగు చూసినట్లు హుజుర్ నగర్ పోలీస్ లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడం జరిగింది. ఇంకా ఈ అక్రమ ఇసుక రవాణా వెనుకాల, నకిలీ పత్రాలు,నకిలీ స్టాంపుల వ్యవహారంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రాంతంలో ఇంకొందరు ఉన్నట్లు పూర్తి విచారణ అనంతరం హుజుర్ నగర్ పోలీసులు వారిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.ఇంత జరుగుతున్న ఏపిలో జగ్గయ్యపేట నియోజకవర్గ పోలీసు యంత్రాంగం నిఘాని పట్టిష్టం చేయకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోందని ప్రజల నుండి వినికిడి. ఇప్పటికైన జగ్గయ్యపేట నియోజకవర్గం నుండి అక్రమంగా ఇసుక తరలింపు పై పోలీస్‌లు ఉక్కుపాదం మోపి,ఇసుక అవసరమైన జగ్గయ్యపేట ప్రజలందరికి ఉచితంగా పూర్తి స్థాయిలో అందే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





### 19 నుండి ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్

**విజయవాడ మేజర్ న్యూస్:** షాపింగ్ పరంగా సౌలభ్యానికి సంబంధించిన అపూర్వమైన వేడుకలో భాగంగా, భారతదేశపు మార్గదర్శక త్వరిత వాణిజ్య వేదిక ఇన్‌స్టామార్ట్, తమ ప్రారంభ వార్షిక మెగా సేల్, భారతదేశపు అత్యంత వేగవంతమైన అమ్మకం అయిన ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ అమ్మకం, కొనుగోలుదారులకు వేగవంతమైన డెలివరీతో పాటుగా ఉత్తేజకరమైన ఆఫర్‌లను సైతం అందిస్తుంది. ఈ సేల్ ఈ నెల 19 నుండి 28 వరకు ఇన్‌స్టామార్ట్ యాప్, స్విగ్గీ యాప్ రెండింటిలోనూ అందుబాటులో ఉండనుంది. ఈ సేల్ కాలంలో కస్టమర్లు 50-90శాతం తగ్గింపుతో భారీ రాయితీలను ఆశించవచ్చు

### పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే కాగిత



**పెడన మేజర్ న్యూస్:** ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన తమ పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించామని ఎమ్మెల్యే కృష్ణ కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలో గల కవి పురం ఎస్వీ పల్లి నందిగామ నందమూరి కొంగల్చెర్ల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ తమ పార్టీ చెందిన కార్యకర్తల కుటుంబాలలో కొంతమంది మరణించడం పట్ల వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ పరామర్శించామన్నారు. ఈ కార్యక్రమంలో సీరం ప్రసాదు, అర్జ నగేష్, భద్రాచలం, నాగరాజు, ప్రసాదు టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.



## ఆర్.సి.యం చర్చికి విరాళం అందించిన ప్రభుదాసు

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** ఈ నెల 8వ తేదీ సోమవారం మేరీమాత పుట్టినరోజు సందర్భంగా మండల పరిధిలోని వెంట్రప్రగడ శివారు పులవర్తి గూడెంలో గల ఆర్.సి.యం చర్చిలో భోజనాలు ఏర్పాటు చేసేందుకు రాసూరి ప్రభుదాసు అందజేశారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు ప్రభుదాసు 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి చేతుల మీదుగా ఆదివారం నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు పాల్గొని ప్రభుదాసును అభినందించారు.

## సత్యనారాయణ పదవీ విరమణ సభలో పాల్గొన్న కైలే



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** నియోజకవర్గ పరిధిలోని జమీగొల్వేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన వాకా సత్యనారాయణ అభినందన సభలో పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. చినపారుపూడిలోని కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో అనిల్ కుమార్ పాల్గొని సత్యనారాయణ దంపతులను అభినందించారు. అలాగే కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొనకళ్ళ జగన్నాథ రావు(బుల్లయ్య),వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకొండలమ్మను దర్శించుకున్న 5వేలమంది భక్తులు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఆదివారం, పౌర్ణమి అగుట వలన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తరించినారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదము, త్రాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షించినారు. చంద్రగ్రహణం కారణంగా నిర్ణయించిన సమయమునకు మధ్యాహ్నం గం.12.30 ని.లకు దేవాలయము మూసివేయటమైనది. మరల సోమవారం ఉదయం గం9.00 విడుపు స్నానం, సంప్రోక్షణ, ఏకాంత అర్చనలు అనంతరం శ్రీ అమ్మవారి పునః దర్శనం కల్పించబడును.అలాగే ఈరోజు మధ్యాహ్నం వరకు శ్రీ అమ్మవారిని సుమారు 5,000 మంది పైగా భక్తులు దర్శించుకొనినారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొనినారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు తెలిపినారు.



## ప్రమాదకరంగా కాల్వర్ట్.. పట్టించుకొని అధికారులు



**రెడ్డిగూడెం, సెప్టెంబర్ 7, మేజర్ న్యూస్:** రెడ్డిగూడెం మండలం మద్దుల పర్వ గ్రామం నుండి కూనపరాజు పర్వ వెళ్లే రహదారి మధ్యలో రోడ్డు పగిలిపోయి ప్రమాదకరంగా ఉంది, ఈ రోడ్డు నుండి తిరిగే రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నారు, వెంటనే అధికారులు స్పందించి పరిశీలించి మరమ్మత్తులు చేయవలసిందిగా రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# మహిళలకు భద్రత కల్పించాలి



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** దేశానికి స్వాతంత్ర్యం లభించి 78 ఏళ్ళు గడిచినా ఇంకా మహిళల మీద అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయని, మహిళలకు భద్రత కరువైందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా ఎ.కొండూరు మండల నాలుగో మహాసభ ఆదివారం చీమలపాడులో జరిగింది. మండల అధ్యక్షురాలు టి.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన మహాసభలో శ్రీదేవి మాట్లాడుతూ నేటికీ మహిళల పట్ల వివక్ష కొనసాగడం శోచనీయమని విచారం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి–నినాదంతో సామాజిక అంశాలపై నిరంతరం ఐద్వా సాగిస్తున్న పోరాటాలను వివరించారు. బడుగు బలహీన వర్గాల మహిళలకు ఐద్వా ఎప్పుడూ అండగా ఉంటోందన్నారు. మహిళలు ఐక్యంగా పోరాడి సాధించుకున్న చట్టాలు అనేక సందర్భాల్లో అమలు కావడంలేదనివాటి అమలుకు కూడా మనం ఐక్యంగా పోరాడాల్సుందని పేర్కొన్నారు. తొలుత ఐద్వా పతాకాన్ని సీనియర్ సభ్యురాలు పానెం ఎలిజబెత్ రాణి ఆవిష్కరించారు.

### నూతన కార్యవర్గం

ఐద్వా మండల అధ్యక్షురాలుగా మేకల స్వర్ణ, ఉపాధ్యక్షురాలుగా పానెం శోభ, కార్యదర్శిగా ఆళ్ల ఉమాదేవి సహా మొత్తం 15 మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కార్యదర్శి ఉమాదేవి ప్రవేశపెట్టిన నివేదికను మహాసభ ఆమోదించింది. ప్రజానాట్యమండలి తిరువూరు టౌన్ కమిటీ కార్యదర్శి పంతంగి తులసీరాణి సౌహార్ద సందేశం ఇచ్చారు. మహిళా సంఘం రాష్ట్ర మాజీ నాయకురాలు దివంగత మానికొండ సూర్యావతి చిత్రపటానికి శ్రీదేవి పూలమాలవేసి నివాళులర్పించారు.

## రామాలయ నిర్మాణానికి ఎన్ఆర్ఐ విరాళం



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండలంలోని తాడంకి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాతల సహకారంతో ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులు అంకురార్పణ చేశారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఆలయ నిర్మాణానికి రెండు లక్షల ఇరవై వేల రూపాయలను విరాళంగా పంపారు. ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ చలపాటి వెంకట గిరిబాబు ఈ విరాళం మొత్తాన్ని స్నేహితులు, బంధువుల ద్వారా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. విరాళం అందించిన ఎన్నారై కుటుంబ సభ్యులను సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు మారగాని సుబ్బారావు, పులి గంగాధర రావు, చలపాటి సుబ్బారావు, సువర్ణ గంటి నాగేశ్వరరావు, మారగాని ప్రసాద్, కట్టా అర్జిబాబు, కాగిత శ్రీనివాసరావు, కాగిత సురేష్, కాగిత బ్రహ్మాజీ తదితరులు అభినందించారు. ఆలయ నిర్మాణంలో మరింతమంది దాతలు భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు కోరారు.

## ప్రత్యేక ముఖ్య కార్యదర్శినీ మర్యాదపూర్వకంగా కలిసిన కుంచే నాని



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్‌ని ఆదివారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే వెంకట దుర్గా ప్రసాద్(కుంచే నాని)



## రైతులకు సరిపడా యూరియా సరపరా చేయాలి

**జగ్గయ్యపేట సెప్టెంబర్ 07 మేజర్ న్యూస్ :** రైతులకు సరిపడా యూరియా అందించి వారిని ఆదుకోవాలని రైతుసంఘం డివిజన్ నాయకులు కాకనబోయిన లింగరావు కోరారు. మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో ఆదివారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని రైతు సంఘం నాయకులు పరచిలించారు. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ మనోహర్, మండల వ్యవసాయ అధికారి వరలక్ష్మి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లింగరావు మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వం యూరియా కొరత లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యూరియా కొరత లేనప్పుడు రైతులు అడిగిన యూరియా ఇవ్వవచ్చు కదా అని, ఈ సంవత్సరం వ్యవసాయం అదనుగా ఉందని కానీ రైతులకు యూరియా సకాలంలో అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని లేకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట కృష్ణ, షేక్ జాన్ సాయబ్, డి భాస్కర్ రైతులు పాల్గొన్నారు.

# అన్నదాత పోరు బాట పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ స్థాయి లో పెదపారుపూడి మండలం దోసపాడు గ్రామంలో రైతులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రైతు పోరుబాట గోడపత్రికలు మాజీ శాసనసభ్యులు అనిల్ కుమార్ ఆవిష్కరించారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మెహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతుల తరుపున పోరుబాట కు సిద్ధమవ్వాలని కైలే అనిల్ కుమార్ ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయన దోసపాడు గ్రామం లో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి అనేక రకమైన హామీలు ఇచ్చి తీరా గద్దెనెక్కాక ప్రజలను మోసం, దగా చేశారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం ద్వారా నాయకులు, కార్యకర్తలు క్యూ ఆర్ కోడ్ డౌన్లోడ్ చేసుకొని ప్రతి గ్రామానికి తీసుకుని వెళ్లి చంద్రబాబు చేసిన మోసం ఎండగట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డ నిధి ఇస్తామని, 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని, నిరుద్యోగ భృతి అంటూ మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని తీరా అధికారం చేపట్టాక ఖజానా ఖాళీ అంటూ హామీలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దోసపాడు గ్రామ కమిటీని గ్రామంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు ఏకాభిప్రాయంతో ప్రకటించారు. అధ్యక్షులుగా దాన్నే నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా ఇంటేటి డేవిడ్ రాజు, మూల్పురి మోహనరావు, కుమ్మరి వెంకటేశ్వరరావు, బల్లవరపు నాగేశ్వరరావు, కార్యదర్శులుగా గోవాడ నాగమల్లేశ్వరరావు, జోగి ఆంజనేయులు, తిరుమాని శివరామకృష్ణ ప్రసాద్, దన్నే చక్రవర్తి నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ గోగం సురేష్, జిల్లా, మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వైద్య ఖర్చుల నిమిత్తం మహిళకు 55000 సాయం అందించిన దేవాంగ యూత్

**పెడన, మేజర్ న్యూస్ :** గూడూరు మండలంలోని కప్పలదొడ్డి గ్రామంలో చేనేత కుటుంబానికి చెందిన మరకా శ్రీలక్ష్మి అనే మహిళకు గత కొన్ని నెలల నుండి కాలుకి ఇన్ఫెక్షన్ సోకి బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం చాలా ఖర్చుయిందని ఇంకా కొన్ని నెలలు వైద్యం చేపించాలని ఏదైనా ఆర్థిక సహాయం చేయమని మన దేవాంగ యూత్ ని త్వరగా ఆమెకు కొంత నగదును ఆర్థిక సహాయంగా అందించామని దేవంగా యూత్ సభ్యులు తెలిపారు. ఈ దేవాంగ యూత్ సేవా సమితి సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకొని ఆమె కుటుంబానికి కొంత నగదును ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సభ్యులు ఒక ప్రకటనలో మాట్లాడుతూ దేవాంగ యూత్ సేవా సమితి,దేవల మహర్షి,దేవాంగ యూత్ పెడన అనే దేవాంగ కుల బాంధవుల వాట్సాప్ గ్రూపులలో శ్రీలక్ష్మికి వచ్చినటువంటి ఇబ్బందులు వివరిస్తూ ఆమె వైద్య సహాయం నిమిత్తం ఖర్చుల కొరకు 55 వేలు నగదును సేకరించి అందించామన్నారు. ఈ మొత్తాన్ని ఆదివారం కప్పలదొడ్డి గ్రామంలోని శ్రీలక్ష్మి ఇంటికి వెళ్లి దేవాంగ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో అందజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కప్పలదొడ్డి గ్రామం సర్పంచ్ యక్కల నాగరాజు,మాజీ సర్పంచ్ కట్ట మునేశ్వరరావు,లైబ్రరీ అధ్యాపకులు పేరిశెట్టి నాగ రవి హాజరయ్యారని



తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే కులంలో దేవంగ యూత్ సేవా సమితి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని వారు అభిలాషించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ యూత్ సభ్యులు ఊటుకూరి సుధీర్ కుమార్, పుచ్చల సుబ్రమణ్యం,బుసం దణపతి, ఉట్ల మల్లికార్జున,బట్ట కోటశివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## చిరు నగర్ గణపయ్య మేళతాళాలతో నిమజ్జనానికి

**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 7, మేజర్ న్యూస్ :** ఒకప్పుడు విద్యార్థి దశలో అక్కడ చిన్న వినాయకుని ఏర్పాటు చేసిన ఆ ప్రాంతం నేడు అంచలంచలుగా పెద్ద పెద్ద వినాయక విగ్రహంలు ఏర్పాటు చేయటం అభినందనీయం.ఆ ప్రాంత యువత గణేష్ మహరాజ్ కి జై అంటూ ఉత్సవాలు ఘనంగా వైభవంగా నిర్వహిస్తున్న ఆ యువతను మనందరం అభినందించాల్సిందే.చిరు నగర్ జగ్గయ్యపేటలో వినాయక చవితి నవరాత్రులు విశేష పూజలతో భక్తిశ్రద్ధలతో నవ రాత్రులు పూర్తిచేసుకుని శనివారం వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డు పాట వేలంలో సిరిగిరి పవన్,అక్షయ బన్నీ 1,20,000కు ఆట పాడుకొని విశేషమైన గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు. ఆ స్వామి వారు ఆ కుటుంబానికి మంచి అష్ట ఐశ్వర్యాలు కలగచేయాలని చిరునగర కమిటీ వారు స్వామివారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో యువత కమిటీ పెద్దలు ఆ ప్రాంతం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా వెల్లటూరులో శ్రీ సత్య సాయి బాబా వారి పల్లకి సేవ



**జి కొండూరు మేజర్ న్యూస్ :** వెల్లటూరు గ్రామంలో ఆదివారం పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబా వారి శతజయంతి వేడుకలను పురస్కరించుకొని ఘనంగా పల్లకి సేవ ను భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. విజయవాడ పట్టణంలోని శ్రీసత్యసాయి సేవా సమితి సీతారామ పురం వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ సత్య సాయిబాబా మందిరమైన పుట్టపర్తి నుండి నిర్వాహకులు పాదుకులను తీసుకొచ్చి వెల్లటూరు గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నీరు,వారు పోసి హారతులు ఇచ్చి భక్తులు సాంప్రదాయ బద్ధంగా స్వామివారి పల్లకి సేవకు ఘనంగా స్వాగతం పలికారు. భక్తులు స్వామి వారి పాదుకలను తమ తమ ఇళ్లలోకి తీసుకువెళ్ళి హారతులిచ్చారు.స్థానిక గ్రామంలోని వేణుగోపాల స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దత్తత గ్రామాల ఇంచార్జ్ టీజేఆర్ గుప్తా, గ్రామ మాజీ సర్పంచ్ జి ఎం యన్ ప్రసాద్, గుండ్రెడ్డి శ్రీనివాస్, సేవాదళ్ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

...

## రైతులతో సమావేశాలు, ప్రవేటు దుకాణాల్లో యూరియా విక్రయాల పర్యవేక్షణ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** యూరియా కొరత నేపథ్యంలో ఆదివారం అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించారు. ఏవో కె. మరళీకృష్ణ, తహసీల్దార్ డి. వనజాక్షి, ఎంపీడీవో ఎవి.రమణలు మూడు బృందాలుగా కార్యదర్శులు, వీఆర్వోలు, వీఏఏలతో కలిసి గ్రామాల్లో పర్యటించి రైతులతో సమావేశమై యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. యూరియా సరఫరా



వివరాలు, ప్రస్తుత పరిస్థితులను రైతులకు తెలియచేసి, రైతులకు అవసరమైన యూరియా మరింతగా అందుబాటులోకి రానుందని చె ప్పారు. ప్రవేటు దుకాణాలు, సొసైటీలను సందర్శించారు. చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి లక్ష్మీపురంలో ప్రవేటు దుకాణాలు తనిఖీచేశారు. లక్ష్మీపురంలో ప్రవేటు దుకాణాలకు 14 టన్నుల యూరియా రాగా ఒక దుకాణంలో దగ్గరుండి పంపిణీని పర్యవేక్షించి రైతులతో మాట్లాడారు. మరో దుకాణంలో యూరియా విక్రయాలపై రికార్డులు పరిశీలించి గోదామును తనిఖీచేశారు. యూరియాను అక్రమంగా నిల్వఉంచకుం డా, విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా ఉండాలని వ్యాపారులకు స్పష్టంచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్ఎ ఘంటసాల కృష్ణమోహన్, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు

## శ్రీ వెంకటేశ్వరునికి చంద్ర గ్రహణ ప్రత్యేక పూజలు




**గుడ్లవల్లేరు సెప్టెంబరు 07 మేజర్ న్యూస్ :** మండలంలోని డోకిపర్రు శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం 'సంపూర్ణ చంద్ర గ్రహణం' కారణంగా ఆదివారం సాయంత్రం 5గంటలకు మూసివేశారు. దేవస్థాన వ్యవస్థాపకులు, మెయిల్ అధినేతలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం 4గంటల నుండి సాయంకాల అర్చన, శుద్ధి, ఏకాంతసేవ చేసిన వేద పండితులు 5గంటలకు స్వామివారి దేవాలయం ముసివేశారు. సోమవారం ఉదయం 5.30గంటలకు ఆలయ శుద్ధి, నివేదన, హారతి, ఏకాంతంగా జరుగుతాయని తెలిపారు. సుప్రభాత సేవతో యధావిధిగా స్వామివారి సేవలు చేపట్టనున్నామని చెప్పారు. సోమవారం ఉదయం 8.30గంటల నుండి స్వామివారి దర్శనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

# భక్తులు మనోభావాలను దెబ్బతీయకూడదు

### ఆలయాన్ని వ్యాపార రంగంగా మారుస్తున్న ఆలయ ఈవో..



**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 7,మేజర్ న్యూస్ :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు రాజగోపురంవద్ద,పార్కింగ్,వాహన పూజ, కేశఖండనశాల వద్ద బొట్టు పెట్టే హక్కునకు ఆలయ అధికారులు టెండర్లు పిలవడం సరైన చర్య కాదు. బొట్టు పెట్టేందుకు కూడా కాంట్రాక్ట్ ఇవ్వటం దారుణం అనే ఆలయ చైర్మన్ జంగాల వాసు అన్నారు. ఆలయం వద్ద ప్రతిదీ వ్యాపార ధోరణిలో చూడటం భక్తుల మనోభావాలను దెబ్బతీయటమే అన్నారు. దీనిని పాలకవర్గం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కి తెలియజేయగా ఆయన కూడా సానుకూలంగా స్పందించారు అని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు సూర్య ప్రతినిధికి తెలిపారు. ఇప్పటికే శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద వాహన టోలు గేటు దగ్గర నుంచి,పాలు పొంగళ్ళు,వాహన పూజలు, కొబ్బరికాయలు,చిన్న తీర్థం, పెద్ద తీర్థం, సెల్ఫోను కొబ్బరికాయలు కొట్టే వద్ద ప్రతిదీ వ్యాపార రంగంగా మార్చిన ఆలయ అధికారులు అమ్మవారికి తిరునామం కూడా వ్యాపార రంగంగా చూడటం చాలా దుర్మార్గమని ఈ విధానాన్ని రద్దు చేయకపోతే ఆలయ ఈవో, సిబ్బంది భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఘాటుగా విమర్శించారు. చైర్మన్ పాలక మండలి తెలియకుండా టెండర్లు పిలిచే విధానంలో చైర్మన్ పేర్లు ఉంచటం ఏమిటి అని ఆయన ఘాటుగా విమర్శించారు. శాసనసభ్యుల వారు కూడా ఆలయ ఈవో పై కఠినమైన చర్యలు తీసుకోవాలి దేవాలయంలో కొంతమంది సిబ్బంది అధికారుల ప్రవర్తన పై కమిషనర్ తో మాట్లాడతానని అన్నారని చైర్మన్ తెలిపారు.

## కవిపురం సొసైటీలో రెండు లక్షలు భీమా చెక్కు అందించిన ఎమ్మెల్యే కాగిత



**పెడన, మేజర్ న్యూస్ :** మండలం కవిపురం పిఏసిఎస్‌లో సభ్యుడు పుప్పాల మాణిక్యాలరావు ఇటీవల మృతి చందడంతో జనతా ఇన్సూరెన్స్ పథకం కింద అతని కుటుంబానికి రెండు లక్షల రూపాయలు మంజూరయ్యాయి అని దానికి సంబంధించిన చెక్కును మృతుని భార్యకు అందించామని అనంతరం మరో సభ్యుడు అచ్యుత వీరన్న ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి సొసైటీ తరపున మట్టి ఖర్చులు నిమిత్తం 10 వేల రూపాయలను ఆ కుటుంబ సభ్యులకు అందించామని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మృతుని కుటుంబ సభ్యులకు ఆదివారం చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఅర్జా వెంకట నగేష్, సీరం ప్రసాద్, పిఎ సి ఎస్ అధ్యక్షుడు పుట్టి శ్రీనివాసరావు, సర్పంచి పుప్పాల స్వరూపారాణి,నాని, సొసైటీ సిఈ ఓ జన్యావుల కృష్ణ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజేరులో యూరియా పంపిణీచేసిన ట్రైనీ కలెక్టర్



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం మాజేరు సొసైటీలో ఆదివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. సొసైటీకి 20 టన్నుల యూరియా రాగా, గతంలో ఇవ్వని రైతులకు మొదట ప్రాధాన్యత ఇచ్చి వారికి తొలుత యూరియాను అందచేశారు. ట్రైనీ కలెక్టర్ పర్వీన్ జహీదా మాజేరు సొసైటీని సందర్శించి యూరియా పంపిణీని ప్రారంభించారు. సొసైటీ పరిధిలో రైతుల వివరాలు, ఇప్పటి వరకూ ఎంత యూరియా పంపిణీచేశారు తదితర వివరాలు తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. గ్రామానికి యూరియా రావటంతో ఉదయాన్నే రైతులు సొసైటీ వద్దకు చేరుకుని యూరియా కోసం గుమిగూడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా సొసైటీ ఆధ్వర్యంలో షామియానా, కుర్చీలు ఏర్పాటుచేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. సొసైటీ చైర్పర్సన్ తిరుమలశెట్టి బాలనాగేశ్వరరావు, సీఈవో ఎస్.ఎస్.చక్రపాణి, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో పరిశ కిరణ్ కుమార్, ఎస్ఐ పిఎస్వి.సుబ్రహ్మణ్యం తదితరులు యూరియా పంపిణీలో పాల్గొన్నారు.

## సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 8వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక– మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక –మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడం తోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చున్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ కోరారు.

## ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**విజయవాడ, మేజర్ న్యూస్ :** సెప్టెంబర్ 8వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చున్నారు.

## వెంకన్న దర్శనానికి భక్తుల రద్దీ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధనను చేపట్టారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ఉన్నారు.

# ప్రతి రైతు వెనుక ప్రభుత్వంమే ఉంటుంది



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 7, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో ప్రతి రైతు వెనుక ప్రభుత్వమే అండగా నిలుస్తుందని మరోసారి నిరూపించారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు.

ఆదివారం వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్షం లో నియోజకవర్గంలోని ఒక్క రైతు కూడా ఎరు వుల కొరతతో ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలలో సాగులో ఉన్న పంటలకు అనుగుణంగా ఇప్పటివరకు 2,792 మెట్రిక్ టన్నుల యూరియా సహా వివిధ రకాల ఎరువులు రైతులకు అందించామన్నారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా మరో 1,000 టన్నులు, నెలాఖరులోగా అదనంగా 1,500 టన్నులు అందుబాటులోకి తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు.

మండలాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి, ఎక్కడా ఎరువుల కొరత లేకుండా, ప్రతి రైతు చెమట చిందించిన పొలంలో పంటలు పుష్కలంగా పండేలా అవసరమైన ఎరువులు సమయానికి అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వ సంకల్ప బలంతో అధికారులు కృషితో జగ్గయ్యపేట రైతాంగానికి ఎరువుల కొరత ఎక్కడా రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాము, ప్రతి రైతు ధైర్యంగా వ్యవసాయ పనులు కొనసాగించవచ్చని వారు ఒక ప్రకటనలో రైతులకు భరోసా ఇచ్చారు.

# గన్నవరంలో యూరియా కొరత లేదు



**గన్నవరం, సెప్టెంబర్ 7, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గంలో ఎరువుల కొరత ఉందంటూ మీడియాలో వస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని నియోజకవర్గంలో ఎరువులు కొరత లేదని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. గన్నవరం నియోజకవర్గంలోని పురుషోత్తపట్నం గ్రామంలో యూరియా కోసం రైతులు పిఏసిఎస్ వద్ద ఎదురుచూస్తున్నారంటూ ఓ ఛానల్ లో స్క్రోలింగ్ రాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావ్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దృష్టికి తీసుకువెళ్ళి సమస్యను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లా పర్యటనకు సిద్ధమైన కలెక్టర్ ఎమ్మెల్యే సూచనల మేరకు గన్నవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఎరువుల వినియోగం, సరఫరా పై రైతుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకొని అధికారులతో మాట్లాడారు. రైతుల అవసరాలు మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ నియోజకవర్గం లో ఎరువుల సరఫరా పై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఎరువులు కోసం రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. రైతులు తమ అవసరం మేరకే ఎరువులను కొనుగోలు చేయాలని ఎక్కువగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టడం వల్ల మిగిలిన రైతులకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. రాష్ట్రానికి పెద్ద మొత్తంలో ఎరువులు వస్తున్నాయని ఎరువులు కొరత ఉండదని ఈ విషయాన్ని రైతులు గమనించాలని యార్లగడ్డ చెప్పారు.



# నాణ్యమైన ఉచిత వైద్య సేవలు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 592మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకట రావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు హనుమకొండ దుర్గ భవాని, కణితి శశిరేఖ, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయ వాడ కామినేని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ భవాని, ఎస్.దాశరథి తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవస రమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకట రావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.

# ఎగ్జిబిషన్ గ్రౌండ్ కోసం దేవాలయ భూములు కేటాయింపు






**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం గొడుగుపేటలో వేంచేసి ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన గొల్లపూడిలో ఉన్న భూములను గోల్ఫ్ క్లబ్ కోసం తీసుకునే ప్రయత్నాలు వివాదాస్పదం అవుతున్నాయి. వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన దాదాపు 40 ఎకరాల భూములు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో ఉన్నాయి. వార్షికంగా ఈ భూములను ఓపెన్ ఆక్షన్ ద్వారా కౌలుకు ఇచ్చి ఆదాయాన్ని దేవస్థానానికి వినియోగిస్తుంటారు. కొద్ది వారాల క్రితం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సదరు భూములను గోల్ఫ్ కోర్టు ఎగ్జిబిషన్ గ్రౌండ్ కోసం కేటాయించాలంటూ దేవాదాయ శాఖ కార్యదర్శి ప్రతిపాదనలు పంపటం పట్ల భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారి ఆస్తులను ఇష్టానుసారం పరాధనం చేస్తే ఊరుకోమంటూ ఆలయ కమిటీ స్పష్టం చేస్తోంది. ఈ అంశంపై మాజీ మంత్రి పేర్ని నానీ మాట్లాడు తూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఆలయాన్ని దుర్గ గుడికి దత్తత ఇచ్చి భూములను కబ్జా చేయాలనే ప్రయత్నం చేశారని ఆరోపించారు వైసిపి అధికారంలోకి వచ్చాక సదరు ఆల యాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తీసుకువచ్చి జీర్ణస్థితిలో ఉన్న ఆలయాన్ని పునరుద్ధరించినట్లు చెప్పారు. ప్రస్తుతం కూటమి నాయకులు కోట్లాది రూపాయల విలువైన ఆలయ భూములపై కన్నేసి జిల్లా కలెక్టర్‌ను అడ్డుపెట్టుకొని హస్త ఘటన చేసు కోవాలని చూస్తే ఊరుకోమన్నారు. గతంలో ఇటు వంటి చర్యలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఖం డించిందని అవసరమైతే ఓపెన్ అక్షరం ద్వారా భూములు అమ్మి వచ్చిన మొత్తాన్ని ఆలయకటాకు జమచేయాలని లేని పక్షంలో ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చెప్పుకునే రాజధాని అమరావతిలోనే గోల్ఫ్ కోర్టు ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేస్తాం..





**పామర్రు మేజర్ న్యూస్ :** జిల్లాలో రైతులకు అవసరమైనంత యూరియాను సరఫరా చేస్తామని, రైతులు ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని ధైర్యంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ రైతులతో అన్నారు. ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి పామర్రు మండలం జుజ్జువరం గ్రామంలో పర్యటించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామంలో నాటు వేసిన పొలం వద్దకు వెళ్లి పొలాన్ని కూడా ఆయన పరిశీలించారు. నాటు వేసి ఎన్ని రోజులైందని, ఏమి విత్తనం వేశారని రైతులను ప్రశ్నించి సమాధానాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రైతులతో మాట్లాడుతూ వారికి యూరియా సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడుగగా తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, స్థానిక రైతు కాకి నాగేంద్రరావు తదితర రైతులు మాట్లాడుతూ యూరియా సరిపడా రావడం లేదని, ఎండలు ఎక్కువగా ఉండటం, వాతావరణం మారడంతో కలుపు మొక్కలు తీయుటకు ఒక కట్ట యూరియా వాడుతున్నామని, అందువలన ఎకరాకు కనీసం 3 కట్టల యూరియా అవసరం ఉందన్నారు. అంతేకాక ఈ ఏడాది ఒక నెల ముందుగా వ్యవసాయ పనులు ప్రారంభించామని, ఎండలు అధికంగా ఉన్న కారణంగా యూరియా వాడకం కూడా ఎక్కువ అవసరం అవుతుందని వల్లూరుపల్లి గణేష్ ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు.

దీనిపై ప్రత్యేక ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ శాస్త్రీయంగా ఎకరాకు 2 కట్టల యూరియా సరిపోతుందని, 3 కట్టల యూరియా కావాలని ముందస్తు ప్రణాళికలు తయారు చేయలేదన్నారు. అధికంగా యూరియా వాడటం వలన పంట నష్టమే కాకుండా భూసారం కూడా దెబ్బతింటుందని రైతులకు హితవు చెప్పారు. ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సరం కంటే ఒక లక్ష మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కువగా రైతులకు సరఫరా చేశామన్నారు. యూరియా పంపిణీలో రైతులకు ఇబ్బంది కలగకుండా గ్రామాల్లోనే పంపిణీ చేస్తున్నామని, ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సొసైటీల ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఇంకా ఎంత యూరియా కావాలి అని ప్రత్యేక కార్యదర్శి అడుగగా రైతులు సమాధానం చెబుతూ వరి పైరు చివరి దశలో ఉందని, ఇంకా ఒక ఎకరాకు మూడో డోసు ఒక బస్తా యూరియా అవసరముందన్నారు.

ప్రస్తుతం 1,775 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఇంకనూ 400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి శివ నాగమణి కార్యదర్శికి వివరించారు. రైతులు ఈ మధ్య యూరియాని కలుపు మందుతో కలిపి ఎక్కువగా వాడటం వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఇటీవల చెప్పారని, ఎక్కువ వాడితే ఆరోగ్యంతో పాటు, భూసారానికి మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే రబీ పంట కాలంలోనైనా కొంతవరకు రైతుల్లో మార్పు రావాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయడం అనేదే కాకుండా వరి పంట వేసే ముందు ఎరువుల రహిత సేద్యం చేపట్టాలని, ఇదివరకు జీలుగ అనే ఒకే పంటను వేసే వారని, అలా కాకుండా 20 లేదా 30 రకాల విత్తనాలను చల్లి

## రైతులెవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదు....

## ఎరువుల వాడకం తగ్గించండి......

## పచ్చిరొట్ట పైర్ల సాగుపై దృష్టి పెట్టండి..

## రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ విజ్ఞప్తి



పంటలు పండిస్తే భూసారం పెరుగుతుందన్నారు. దాంతో రైతుకు ఆదాయం పెరగడమే కాకుండా ఎరువులు, నత్రజని వంటివి అవసరం లేదన్నారు. రైతులందరికీ యూరియా సరఫరా చేస్తామని, ఎవరు కూడా మూడో డోసు కావాలని ముందుగానే తీసుకునేందుకు ఆత్రుత చూపవద్దని, ఎలాంటి ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు.

అనంతరం కార్యదర్శి రైతులతో ఇక వారికి నమ్మకం కలిగిందా అని అడగడంతో రైతులు మాట్లాడుతూ అధికారులందరూ వచ్చి చెప్పారు కాబట్టి తమకు పూర్తి నమ్మకం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఈ పర్యటనలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, ఉయ్యూరు ఆర్డీఓ బి.ఎస్.హేలా షారోన్, డి.ఎల్.డి.ఓ రాజేష్, వ్యవసాయ శాఖ ఏడి మనిధర్, స్వర్ణలత, ఏవో శాంత, మండల వ్యవసాయ అధికారి శివ నాగరాణి, వీఏఏ షబానా, పామర్రు మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, తహసిల్దార్ జి.రవికాంత్, ఆర్.ఐ. ఎ. రాము, ఎంపీడీవో కె.జ్యోతి తదితర అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రైతులు ఏమాత్రం ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలి





**గన్నవరం, సెప్టెంబర్ 7, మేజర్ న్యూస్ :** యూరియా నిలువలు అందుబాటులో ఉన్నాయని యూరియా నిరంతరం సరఫరా జరుగుతుందని రైతులు ఏమాత్రం ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులతో అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో వివిధ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జిల్లా కలెక్టర్ ఎక్కడికక్కడ రైతులతో ముఖాముఖి మాట్లాడి యూరియా స్థితిగతులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యూరియా నిరంతరం కొనసాగుతుందని ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని జిల్లా కలెక్టర్ వారికి వివరించారు. ఇంకా యూరియా లోడ్లు వస్తున్నాయని, సరఫరా నిరంతరం కొనసాగుతుందని హామీ ఇస్తూ జిల్లా కలెక్టర్ వారిలో నమ్మకాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం ఖరీఫ్ సీజన్లో ఇదే సమయానికి 27 వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేశామన్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా ఇప్పటికే అంతకుమించి యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా గన్నవరం మండలం పురుషోత్తపట్నం లో రైతులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, నక్క శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో కొంతమంది ఇప్పటివరకు ఒక కోటా యూరియా కూడా రాలేదని, మరి కొంతమందికి రెండో కోటా రావాల్సి ఉందని కలెక్టర్కు వివరించారు. ఎకరాకు 3 కట్టల యూరియా అవసరముందని రైతులు కలెక్టర్ కు తెలిపారు. కొంతమంది రైతులు కాని వారికి కూడా యూరియా పంపిణీ చేశారని ఫిర్యాదు చేశారని, ఒక ఎకరా ఉన్న రైతుకు 50 ఎకరాలు ఉన్న రైతుకు ఒకే విధంగా ఒక యూరియా బస్తాను ఇస్తే ఎలా సరిపోతుందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సోమ, మంగళవారాల్లో యూరియా లోడ్ లు సరఫరా అవుతుందని, అందులో నుంచి వారికి కేటాయించడం జరుగుతుందన్నారు. రైతులందరికీ యూరియా తప్పకుండా సరఫరా చేస్తామని, ఎవరు కూడా ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా నిల్వ అందుబాటులో ఉన్నాయని ఇంకా అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు యూరియాను జిల్లాకు తెప్పిస్తున్నామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా ఎకరాకు రెండు బస్తాల యూరియా సరిపోతుందనీ, అంతకుమించి వినియోగిస్తే పంట నష్టపోవడమే కాకుండా భూసారం కూడా దెబ్బతింటుందని కలెక్టర్ రైతులకు వివరించారు. పురుషోత్తపట్నంలో కొండపావులూరు గ్రామం వెళ్లే మార్గంలో ఊర చెరువు నుండి నీరు పొంగి లో లెవెల్ కాజ్వేపై నీరుపారుతూ రాకపోకలకు ఇబ్బంది కలుగుతూ ద్విచక్ర వాహనాలు జారి పడిపోయి వాహనదారులకు దెబ్బలు తగులుతున్నాయని, ఈ ప్రమాదాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, పురుషోత్తపట్నంలో ముస్తాబాద్ వెళ్లే రహదారులు భవనాల రహదారి పక్కన ఉన్న కాలువ మట్టి కోతకు గురై మట్టి తొలగిపోతుందని రానున్న రోజుల్లో రహదారి దెబ్బ తినే అవకాశం ఉందని గ్రామానికి చెందిన నాయకులు మోహన్ రావు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి యూరియా సరఫరా, వాడకంపై రైతులకు వివరిస్తున్నారా లేదా సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉంగుటూరు మండలం పెదవుటుపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎకరాకు ఎన్ని యూరియా కట్టలు వాడుతున్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు మధు సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ తమకు ఎగరాకు మూడున్నర కట్టల యూరియా అవసరం ఉందని ఇప్పటివరకు ఒక కట్ట సరఫరా చేశారన్నారు. ఇంకా యూరియా సరఫరా చేయాలని కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఆదివారం రాత్రి సోమవారం మరో రెండు లోడ్లు యూరియా రానుందని ఎవరు కూడా ఆందోళన చెందవద్దని ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. తదుపరి పెదవుటుపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మెగా అవుట్రీచ్ కార్యక్రమం సజావుగా జరిగిందా లేదా అని జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఇందులో భాగంగా రైతులకు యూరియా సరఫరాపై సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి వివరించి ఆందోళన చెందవద్దని చెప్పారా లేదా అని జిల్లా కలెక్టర్ కూడా ఇంటింటికి తిరిగి రైతులు మరీదు శివయ్య భార్య నాగమణి, పడమట శ్రీదేవి, సింహాద్రి సుబ్బారావు లతో ముఖాముఖి మాట్లాడారు. సిబ్బంది వచ్చి చెప్పారని రైతులు జిల్లా కలెక్టర్ తో చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఎకరాకు ఎన్ని బస్తాల యూరియా అవసరం ఉందని, ఇప్పటివరకు ఎన్ని బస్తాల యూరియా వేశారని కలెక్టర్ రైతులను అడుగగా వారు మాట్లాడుతూ తాము ఎకరాకు కనీసం 3 బస్తాల యూరియా వేస్తామని ఇప్పటివరకు ఒక బస్తా మాత్రమే సరఫరా చేశారని జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఇంకా 2 యూరియా బస్తాలు సరఫరా చేయాలని వారు కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని సోమ, మంగళవారాల్లో మరో రెండు లోడ్లు వస్తున్నాయని ఎవరు కూడా ఆందోళన చెందవద్దనీ, ధైర్యంగా ఉండాలని, ఓపిగ్గా సమాధానం చెప్పారు. దీంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. తదనంతరం జిల్లా కలెక్టర్ బాపులపాడు మండలం వీరవల్లి, కానుమోలు గ్రామాల్లో కూడా ఇంటింటికి తిరిగి ఔట్రీచ్ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది సరిగా నిర్వహించారా లేదా రైతులతో విచారించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట గుడివాడ ఆర్డీఓ జి బాలసుబ్రమణ్యం, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, గన్నవరం వ్యవసాయ శాఖ ఏడి సునీల్ కుమార్, గన్నవరం, తహసీల్దారు శివయ్య, ఉంగుటూరు ఎంపీడీవో ప్రసాద్, బాపులపాడు తహసిల్దారు మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి శివప్రసాద్, పురుషోత్తం పట్నం సర్పంచ్ మాదాల రోహిణి, పెదవుటుపల్లి సొసైటీ కార్యదర్శి లోకేశ్వరి వి ఏ నాగేంద్రబాబు, తదితర అధికారులు, అనధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# గణనాథుని ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరిపై ఉండాలి



**విజయవాడ సెంట్రల్ టీడీపీ నాయకులు దేవరపు మాల్యాద్రి**

**రూ.1,16,000లు లడ్డూ వేలం పాడిన దేవరపు మాల్యాద్రి**

**కోలహలంగా స్వామి వారి ఊరేగింపు, నిమర్జన**

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** శ్రీనగర్ కాలనీ 1వ లైన్, శ్రీశ్రీశ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన శ్రీశ్రీశ్రీ గణేష్ మహోత్సవాలు ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 6వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ మహోత్సవాలలో భాగంగా కమిటీ సభ్యులు ప్రతి రోజు ఉదయం 8 గంటలకు సాయంత్రం 7 గంటలకు పూజా కార్యక్రమం, అనంతరం తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు. భక్తుల గోత్ర నామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ 5వ తేదీ శుక్రవారం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, వందల మంది ప్రజలు పాల్గొని అన్నప్రసాదాలను స్వాకరించారు. 6వ తేదీ శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన లడ్డు వేలం పాటలో స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు దేవరపు మాల్యాద్రి పాల్గొని రూ. 1,16,000లకు లడ్డూని దక్కించుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు దేవరపు మాల్యాద్రి మాట్లాడుతూ లడ్డూ వేలంపాటలో దక్కించుకోవడం ఆనందంగా ఉందని, లడ్డూ పాడి ఆ సొమ్ముతో స్వామికి తన వంతు రుణం తీర్చుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఈ మహోత్స వాలను ఘనంగా నిర్వహించిన కమిటీ సభ్యులైన గౌరవ అధ్యక్షులు కొండా మాలకొండయ్య, కార్యదర్శి మేడసాని చంద్రశేఖర్, అధ్యక్షులు గడ్డం శ్రీనివాసరావు, అడుసుమిల్లి బాలాజిని ఈ సందర్భంగా అభినందిస్తున్నామన్నారు. ఇదే విధంగా ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుకుని ఆ స్వామికృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నామన్నారు.

# ఆందోళన అనవసరం.. సమృద్ధిగా ఎరువులు

**డివిజన్ వ్యాప్తంగా సజావుగా యూరియా పంపిణీ**

**రైతులకు అవగాహనలో ఆర్‌డీవో కావూరి చైతన్య**





**విజయవాడ, సెప్టెంబర్ 7, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి సూచనల మేరకు విజయవాడ డివిజన్ వ్యాప్తంగా యూరియా, ఇతర ఎరువుల పంపిణీకి చర్యలు చేపట్టామని, ఎరువుల సరఫరా సజావుగా సాగుతోందని విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య తెలిపారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన అగ్రికల్చర్ అవుట్‌రీచ్ (జన జాగృతి) కార్యక్రమం జరిగింది. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఎరువులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య డివిజన్‌లో విస్తృతంగా పర్యటిస్తూ అన్నదాతలను కలిసి ప్రభుత్వ ఏర్పాట్లను వివరించారు. మైలవరం మండలం పుల్లూరు, విజయవాడ రూరల్ కె.తాడేపల్లి, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రైతులతో మమేకమై సమీప సొసైటీల్లో ఉన్న ఎరువులు, త్వరలో రానున్న ఎరువుల సమాచారంతో పాటు పంట దశనుబట్టి ఎరువుల వినియోగం ఎలా ఉండాలనే దానిపైనా అవగాహన కల్పించారు. పర్యావరణానికి, నేల సారానికి ఉపయోగపడటమే కాకుండా తక్కువ ఖర్చుతో సాగును లాభసాటిగా మార్చే నానో యూరియా, ఎరువుల ప్రయోజనాలకు కూడా ఆర్‌డీవో చైతన్య వివరించారు.

# ప్రతి రైతుకు అవసరం మేరకు యూరియా అందిస్తాం



**ఎమ్మెల్యే కుమార్ రాజా**

**పామర్రు మేజర్ న్యూస్:** రైతులకు అవసరమైన యురియాను అందించే విషయంలో తమ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో యూరియా నిలువలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతుకు అవసరమైనంత మేరకు యూరియాను సరఫరా చేస్తామని ఈ విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. యూరియా కొరత మన రాష్ట్రంలోనే కాదని దేశ వ్యాప్తంగా ఉందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో ఆంధ్ర ప్రదేశ్ లో అనుకున్న దానికంటే ఎక్కువగానే యూరియాను సరఫరా చేయడం జరుగుతోందన్నారు. పామర్రు మండలంలో ప్రస్తుతం 200 టన్నుల యూరియా వచ్చిందని, మరో మూడు రోజుల్లో మరో 200 నుండి 300 టన్నుల వరకు యూరియా వచ్చే అవకాశం ఉందన్నారు. కావున రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని ప్రతి ఒక్క రైతుకు అవసరం మేరకు యూరియాను తప్పనిసరిగా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ విషయంపై విపక్ష పార్టీలు అసత్య ప్రచారం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. రైతులు ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని అని ఆయన కోరారు. ఎవరికైనా యూరియా అవసరం మేరకు అందనట్లయితే తనకు గాని, మార్కెట్ కమిటీ చైర్మన్ జన్నుల శోభన్ బాబు, జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ లను సంప్రదించాలని ఆయన తెలిపారు. పైన పేర్కొన్న వారిలో ఎవరిని సంప్రదించినా తప్పనిసరిగా యూరియా అందించేలా తగు చర్యలు చేపడతారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## రైతులకు యూరియా పంపిణీ

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** రైతులకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా యూరియా పంపిణీ చేస్తున్నామని పిఎసిఎస్ అధ్యక్షులు బెజవాడ శంకర్ పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడు పీఏసీఎస్ లో ఆదివారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు యూరియా అందించటం జరిగిందన్నారు. యూరియా ఇవ్వడం వల్ల రైతులు అనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు భరోతు పిక్లనాయక్, గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కొండేపాటి సుబ్బారావు, జంగా స్టాలిన్, జిల్లా ఎస్టి సెల్ కార్యదర్శి బాణావతు భిమా నాయక్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ కరీముల్లా, మైనార్టీ నాయకులు షేక్ఆదాం షరీఫ్, బీసీ నాయకులు సింహాద్రి సత్యం, బెజవాడ అదిశేషు, ఏవో టిప్పు సుల్తాన్, వీఆర్వోలక్ష్మయ్య, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మేడూరులో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని మేడూరు గ్రామపంచాయతీ శివారు గ్రామాలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పర్యటించి పలువురిని పరామర్శించారు. మేడూరు శివారు ముత్తరాశి పాలెం లో తెలుగుదేశం పార్టీకి చెందిన గంజాల వీర శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. అలాగే మరో శివారు గ్రామమైన ధూళిపూడిపాలెంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 56,441 రూపాయల చెక్కును లబ్ధిదారుడు అంబటి గోపాలకృష్ణకు స్వయంగా కుమార్ రాజా అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో వినాయక నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా జరిగిన నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజాతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999